# అచ్చులో నా పేరు

★ శ్రీ ఎం. బి. జోసెఫ్. ★

"ఏమిత్రా ఎప్పుడూనూ, వెధవ ఫెన్సిళ్లూ, కాగితాలూ కలాలూ నీవూనూ?"

"ఇది వెధవపనత్రా, నీమొహంగాదూ?"

"నీమొహం నామొహం, పోనీ ఒక్కటి, Just one ఏదీ ఒక్కటైనా వేసుకున్నా షాపాన బోయాడూ ఒక్క ఎడిటర్ అయినా సరే? సిగ్గులేకపోతేసరి, రా. పేకాట వేద్దాం రా."

"నేను రావడానివీల్లేదు. రాను. ఇది పూర్తిజేసి కాని రాను."

"ఒరే రామూ! ధాతకరువు పోయినప్పటి నుండి రాస్తున్నాడు వీడు. ఏగోనెడో అయి నాయి చిత్తులు పాపం. ఒక్కసారి గూడా పడిందికాదు వీడిపేరు. పోనీ అడిగిచూడు. మొహముంది అద్దముంది."

"ఇదిగోచూడు. ఈసారి నాపేరు 'చిత్ర గుప్త'లో పడదా, యిదే ప్రతిజ్ఞ: మీసాల్లే కుండా, సున్నపుబొట్ల బోడితలతో వూరంతా తిరిగివస్తా. ఏం. సరేనా."

"నీమోహంనీమోర. అదీ తేల్తుందిగా వుండు! చూద్దాం. రా, రా, వీడెందాక యింతే. వెడదామురా. పోష్టాఫీసువాళ్ళకు అదనంగా పని యివ్వడమేగాని యింకేమీ లేదు. ఆ అణాలున్నా కాఫీకొస్తయి" అంటూ వెళ్ళాడు వెంకట్రావు రెండో వానితో.

మా స్నేహితుడు వెంకట్రావీలా అన్న వ్పటినుంచీ నా హృదయంలో చేయిబెట్టి, చేయిగాదు ఖడ్గంతో దూసినట్టుంది. కథ పూర్తిచేసి కాపీరాసి పంపాను మెద్రాసుకు. పైపెచ్చు అరుపైసాలిచ్చి పోస్టురసీదు గూడా తీసుకున్నాను. ఆరాత్రి సరిగ్గా నిద్రపట్టలేదు. ఏదోఆలాపనగా వుంది. నా కథ పడనట్టు, 'చిత్రగుప్త'ను చూపించి వాళ్ళంతా కోతి మూకల్లా ఎగతాళి చేసినట్టు, యింకా ఏమేమో పిచ్చిపిచ్చిగా కలలుగూడా. 'కలలో వస్తే యిలలో జరుగదు' గదా అని కొంత ధైర్యం వహించాను.

'అన్నానుగా వస్తుందని. ఏమిటీ మన ప్రతిజ్ఞ! అంటె. వచ్చిందీ నాపేరు. ఆ వాజమ్మ వెంకట్రావుగాడితో చెప్పండి. 'చిత్రగుప్త' గూడా చూపండి వాడి మొహా నికి. నమ్మడు లేకపోతే.'

"ఏమండీ! ఏమండోయ్! ఏమిటి" అంటూ కంగారుగా లేపారు మావాళ్ళు. లేచాను. చూచాను. అంతా గాఢనిద్రలో వున్నారు. 'ఏమన్నాను నేను' అంటూ కండ్లు మూశాను: 'ఈలా కథపంపాను. అదే ఆలాపనగా వున్నదీ' అంటే బాగుండదని 'పడుకుందూపడుకో' అంటూ. ఏదోచెప్పి వూరుకున్నాను.

ఎందుకో చెప్పలేను గాని, నా మట్టుకు నాకు ఘట్టినమ్మకమైపోయింది, నా కథ వేసుకొంటారు. నాపేరు అచ్చుపడుతుంది అని.

ఒకరోజు ఉదయం 7:30 ఆ ప్రాం తాల్లో పోష్టాఫీసుకువెళ్ళి వస్తున్నా. 'ఏరా ప్రొద్దున్నే బజారెళ్ళేవు. సంగతులేమిటి?' అన్నాడు వెంకట్రావు యెదురుపడి. 'పోష్టా ఫీసునుంచి' అంటూ వాణ్ణి దాటాను. చిత్రగుప్తలో అచ్చుపడ్డ నాపేరు వాడికి చూపిం దాకా వాడితో మాట్లాడకూడదు, వాడు చేసిన అల్లరికని మనసులో నిశ్చయించుకొంటూ.

'ఏమిత్రా అతొందర. ఎక్కడినుండి రావాలి? ఎందుకొరకొస్తుంది. వచ్చిందా, రాలేదా చెప్పు యివన్నీ విందాం' అన్నాడు వాడు.

'మెద్రాస్ నుంచి 'చిత్రగుప్త' ఎడిటర్ వ్రాస్తారేమోనని వెళ్ళాను. గాని యీవేళ టపాలో రాలేదు.' అన్నాను.

'దేనికీ వారు నీకు వ్రాయడం?

'మొన్నకథ పంపానుగా మరి నా ఫోటో పంపమని, బ్లాక్ చేయించి కథతోపాటు ఫోటో వేస్తామని' వ్రాస్తారేమోనని'

'మరి మన వూళ్ళో ఫోటోగ్రాఫర్ లేడాయె బాపట్ల వెళ్ళి ఫోటో తీయించు కొచ్చావా?'

'నీకెలా తెలిసిందిరా?'

'ఏలాగో లే.

'ఏరా మనకథ వేస్తారుగారా?'

'అయ్యో! వేస్తారా? అని ప్రశ్నటరా నీ రచనలు లేకపోతే 'చిత్రగుప్త'కు కళే లేదురా పాపం. వారు నిన్ను చిన్న చూపు చూస్తార్రా? నీ కథ లేకపోతే 'చిత్రగుప్త' అనేదే లేదనుకో- నీ కెందుకా పిచ్చ. పద. పద' అంటూ వెళ్ళాడు వెంకట్రావు.

ఈ ఫోటో చరిత్రంతా చెప్పేవాణ్ణి కాదు గానండీ, వెంకట్రావుగాడితో, వీడు ముందు చెప్పినట్టే జరిగిందంతాను! ఏలాగైనా వీడూ....' అంటూ ఆశ్చర్యపోతాను రేపు

'చిత్రిగుప్త' పేరు, ఫొటో యివన్నీ చూసి, మొహాన గొట్టినట్టుంటుంది అనుకొని, ముందే చెప్పా వున్నదంతా యిహదావరికం దేనికని.

రోజు యీలా 7. 30 కి పోస్టాఫీసుకు వెళ్లడం ఒక డ్యూటీ అయిపోయింది. పదిహేను రోజులు పైగా గడిచాయి 'వస్తే మేమున్నాము గాదటండీ యివ్వడానికి? మీరలా కాళ్ళు గొట్టుకొంటు శ్రమపడి రావడం దేనికి, పెద్దవారు, రాని వుత్తరాల కోసరం? మేము తెస్తాము లెండి' అన్నాడు శ్రీరాములు ప్యూన్. ఇన్ని రోజులయినాయి. యిహ ఫోటోకు వ్రాయరు. వారికి బ్లాక్ తీయించడానికి వ్యవధి ఏదీ. ఒకవేళ బ్లాక్ లేకుండా వక్క కథే వేస్తారేమోననుకొని, శ్రీరాములు గొడవ పడలేక, పోస్టాఫీసుకు వెళ్ళడం మానేశాను.

రెండుమూడుసార్లు ట్రెయిన్‌దగ్గెరకెళ్ళా; ఎవరైనా స్నేహితులు మెడ్రాస్‌వెళ్ళేవాళ్ళు కన్పిస్తే కాస్త ఆఫీసుకువెళ్ళినాకథెంతవరకు కంపోజ్ అయిందో కనుక్కొని వ్రాయమని చెప్పడానికి. ఎవరూ కన్పించినట్టులేక మానేశాను. వెంట్రావుగాడిగోల పడలేకుండా వున్నానిక్కడ. సెలూన్‌లో మొదటితేది నాటికి కత్తి బాగానూరివుంచమని వాడు మంగలితో చెప్పినట్టుగా రూమర్ బయల్దేరింది మా స్నేహితుల్లో. వాడొకసారి మాయింటి కెళ్ళి 'అమ్మాయీ!' అంటూ యీ కథావిధానమంతా చెప్పినట్టు గూడా పసిపట్టేను.

మావాళ్ళు 'చిత్రగుప్త తెప్పించుకొందామండీ!' 'ఏమండోయ్ అచ్చులో పేర్లు పడ్డం గొప్ప సంగతికదండి' మీరు గూడా వ్రాయరాదొకకథ' క్రొత్తరకపు ధోరణిలను బట్టి. ఏలాగైతేనేం, చాలామట్టుకు వ్యాపించిందీవిషయం. ఒకవేళ యీ కథపడక పోతే, ఆత్మహత్య మహా పాతకమనేగాని, కాకపోతే అదేమేలనిపిస్తోంది యీ హడావిడీ చూస్తూ వుంటే నాకు.

మరి యీ అసెంబ్లీ అభ్యర్థులకెలావుంటుందో! అంతంత పెట్టుబడిపెట్టి, పెట్రోలు తగలేస్తూ వూళ్ళూళ్ళూ తిరుగుతూ, వోటర్ల కాళ్లుబట్టి, చేతులు పగలదీసి రూపాయిలు బెట్టుతూ శ్రమపడుతుంటే చివరికేలాగవుతుందోనని, అణాపెట్టుబడిదారునికి నాకే యీలాతుంటే! ఇన్నిటికీ 'గుండె' కావాలీ అంటూ 'గుండె' ధైర్యంచేసుకున్నా.

వెంకట్రావుకంటె ముఖ్యుడు 'రావు'తో 'చిత్రగుప్త' రాగానే యిదిగో యీ 'అణాన్నర'తో కాపీవోటికొను. నిదానంగా చూడు. మనపేరు రావాలిగా! ఒకవేళరాదా నీయిష్టం' చావుకబురు చల్లగా చెప్పాలి' ఏలా చెప్పాలో తెలియకపోతే 'చిలకమర్తి లక్ష్మీ నరసింహం' గారి 'నవ్వులగని' చూడు. అందులో వారు చెప్పారు యీ విధాన్ని. విషయం గుండె చదిరేదిగనక నీకింతగట్టిగా జెప్పాను. జాగ్రత్తసుమా. కనపడ్డా, కనబడకపోయినా మోసమేసుమా! పడకపోయెనా నా గుండె ఆగుతుంది. పడిందా అమిత సంతోషంమీద గూడా అలానే జరుగుతుంది. అందుకనే లాటరీలు వేసినవారు టెలిగ్రాము'లు ఫ్రెండ్సు పేరా ఆర్డరువేస్తారు. నిదానంగా తెలుసుకుంటారు. ఇదీ అంతే. ఇక జెప్ప నవసరం లేదనుకొంటానంటూ 'చిరునవ్వు'తో వెళ్ళాడు. మరి 'చిరునవ్వు' అప్పుడుకాదుగదా. యీ నాటికీ గూడా అర్థంగాలేదు ఎందుకుచుపాడో.

మొదటితేది వచ్చింది. రాకుండా వుంటుందా మరి! నేను కాపీ కొనలేదుగదా ఆ పూట బజారుకుపోవడం మానేశాను ఆ కబురు వినబడుతుందేమోనని ఏస్నేహితుడి ద్వారానైనా. ఇంట్లోనే వున్నా. అంతకళగాలేను. ఇంట్లో ఏమనుకొంటారోనని మనసులో వున్నదంతా చూపలేదింకా, ఈరోజు మొదటి తారీఖుగదా 'చిత్రగుప్త' వస్తుందా అంటే 'ఏదోలే' అన్నాను చికాకుగా మావాళ్ళతో.

నాలుగయింది. వెంకట్రావువాడి వానర సైన్యంతో అప్పుడే వెళ్లాడు క్లబ్‌కు. అంతకు ముందే 'చిత్రిగుప్త' చూచి వుంటాడని చెప్ప నక్కర్లేదు. 'చిత్రగుప్త' క్లబ్ దగ్గిరకు పట్టుకొస్తాను రమ్మంటూ వెళ్లాడు రావు. నిదానంగా క్లబ్ దగ్గిరకు చేరేటప్పటికి అయిదయింది. టెన్నిస్ ఆడుతున్నారు. ఖర్మం, వెంకట్రావు ఆడి కూర్చున్నాడు. 'రావు' ఆడుతోన్నాడు. కోర్టు చుట్టూ కూర్చున్నారు చాలామంది. యిద్దరు ముగ్గురు సోడాలుత్రాగే వన్లా వున్నారు వెంకట్రావుతో సహా, షెడ్‌లో మట్టుకో పెద్ద మనిషి పేపరు చూస్తు కూర్చున్నాడు- మెల్లిగా వెళ్ళి షెడ్‌లో కూచున్నా. వెంకట్రావు మెడఎత్తి సోడా త్రాగుతూ చూశ్లేదు నన్ను. నా ముందే వుంది 'చిత్రిగుప్త' ఎత్తాను పుస్తకం. చేతులు వొణుకుతున్నాయి. తెరచాను పుస్తకం. త్రిప్పేను పేజీలు. కండ్లూ కన్పిస్తున్నట్టు తోచలేదు. ఆఖరుదాకా అలానే త్రిప్పాను. కథ కన్పించినట్టు లేదు.

'ఏదోయ్, అని వెంకట్రావు అనేటప్పటికి పిడుగు నాకు ప్రక్కగానే కొంచం దూరంలోనే పడ్డంటుంది. 'వస్తున్నా' అన్నా మెల్లగా మూడుసార్లు ఆ మూలాగ్రంగా చూచాను. చేతిరుమాలుతో కండ్లు తుడుచుకొన్నా. లేదు కథ. చెమట్లు పోసింది వొళ్లంతా. కూర్చోలేక పోతున్నా. లేచా బయటికి. వచ్చా రోడ్డునబడ్డా. 'రావురా' అనే వెంకట్రావు కేక వీపున వీసెడు గుద్దులా అయింది. జవాబు యివ్వకుండా వచ్చా కాస్త పెద్దవాళ్ళున్నారు కోర్టు దగ్గెర నాపాలిటి రక్షకుల్లాగా, లేకపోతే

యముడులాగా వెంటబడేవాడు వెంకట్రావుగాడు.

తూలుతూ యిల్లుచేరా. మంచం వేసుకొన్నా. శాలువాముసుగుబెట్టా.

'లేదమ్మాయీ! మనవాడు?'

'పడుకొన్నాడన్నయ్యా!'

'ఎనిమిదివరకూనా?'

'రాత్రి ఆరింటికే పడుకొన్నారు. పైన పస్తూ గూడాను!'

'అరే పాపం' అనే వెంకట్రావు గొంతు వినిపించింది మావాళ్ళతో సంభాషిస్తుంటే. నిద్రపోయినట్టేగాని మగత యింకా బాగా వదిలిందిగాదు. వెంకట్రావు లోపలికి వొచ్చాడు. 'ఏమోయ్ యీమాత్రానికి? లే. కాఫీకిరా.'

'కాఫీ ఏమిటీ. యిప్పుడూ?

'నీ మొహం తెల్లవారి ఎనిమిదైంది.'

'అబ్బ' అంటు వొళ్ళు విరుచుకుంటూ బయటికొచ్చా. వాడు నావెంటవచ్చాడు. చెరో కుర్చీమీద కూచున్నాం.

'ఏమిటన్నయ్యా!'

'ఏమిలేదమ్మాయ్. వాడిపేరు అచ్చులో పడిందికాదు. యీనెల్లో. పోనీ యింకో నెల్లో వస్తుంది.

'సరే యీమాత్రానికేనా, ఆ ఫైలూ, పెన్నూ, అదీ యిదీ అంటూ నాదుంపతెంచడం! అబ్బో ఏం వ్రాతకాడులా కన్పిస్తారనుకొన్నా రన్నయ్యా. పెద్ద ఆఫీసుయీయనాను! బలేదర్జా బయటపడిందీ!"

'ఏమోలే అమ్మాయ్. పాపం ఖిన్నుడయాడు.'

'సరేలేవోయ్' కూచోమంటూ వెళ్ళి స్నానంగానిచ్చి, బట్టలువేసుకొని 'రమ్మంటూ' వెంకట్రావును వేసుకొని కాఫీకెళ్ళాను.

'తెలిసిందిగా సత్తా. యింకోసారి ఫైలు అందించమనండి చెప్తా మీపని' అని మావాళ్ళు అంటూన్నట్టు వినబడింది వెళ్తూన్నా నాకు.

*

*